
సాక్షి ప్రకాశం

శుక్రవారం । 15 । డిసెంబర్ । 2023



అడవిలో అనంత చరిత్ర!

కొత్తిపి చాళుక్యులు.. విజయనగర రాజులు.. కాకతీయ రాజులు.. శాయపునాయుడి వంశస్తుల పాలనలో ఎందరో చక్రవర్తులు, మహారాజులు నడయాడిన నేల పశ్చిమ ప్రకాశం. - IIలో..



గెలుపే లక్ష్యంగా పనిచేయండి

పదవి పొందడం అంటే బాధ్యతను మరింతగా పెంచుకోవడమేనని మహిళా విభాగం నాయకులకు ఎమ్మెల్సీ పోతుల సునీత దిశానిర్దేశం చేశారు. - IIలో..

గరిష్టం/కనిష్టం 31.4/21.6

వాతావరణం

పొగమంచు ఎక్కువగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

మరింత మెరుగ్గా పౌర సరఫరాల సేవలు

● రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు దేవి



అధికారులతో సమీక్షిస్తున్న రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు దేవి

ఒంగోలు అర్బన్: చిన్నపాటి లోపాలు ఉంటే సవరించుకుని మరింత మెరుగ్గా పౌర సరఫరాల సేవలు ప్రజలకు అందించాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు జి.దేవి సంబంధిత అధికారులకు సూచించారు. బుధ, గురువారాల్లో జిల్లాలోని ముండ్లమూరు, మద్దిపాడు, తాళ్లూరు, ఒంగోలు మండలాల్లో పలు ప్రభుత్వ పాఠశాలలు, రేషన్ షాపులు, మొబైల్ రేషన్ వాహనాల ద్వారా ప్రజా పంపిణీ, ప్రభుత్వ హాస్టళ్లు, స్టాక్ పాయింట్లను తనిఖీ చేశారు. గురువారం ప్రకాశం భవనంలో డీఎస్ఓ ఉదయభాస్కర్‌తో కలిసి పౌర సరఫరాలు, ఆహార భద్రతా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవి మాట్లాడుతూ విద్యార్థులకు వసతి గృహాల్లో ఆహారం, పాఠశాలల్లో అందజేసే ఆహారంలో నాణ్యతతో పాటు నిర్దేశకాలను పక్కాగా అమలు చేయాలన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అర్హులందరికీ రేషన్ సరుకులు అందజేయాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ సుబ్బారావు, సివిల్ సప్లయిస్ అధికారి గ్లోరియా, శిశు సంక్షేమ, వైద్యారోగ్య, తూనికలు, కొలతల శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి

ఒంగోలు సెంట్రల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిత అధికారి ఎం.అంజలి తెలిపారు. ఉదయం 9.30 గంటలకు పట్టణంలోని సీవీఎన్ రీడింగ్ రూమ్ ఎదురుగా తాతా బిల్డింగ్ ముందు గల అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి, 10 గంటలకు కోర్టు సెంటర్ రోడ్డులో గల అమరజీవి విగ్రహానికి నివాళులు అర్పించనున్నట్లు చెప్పారు. కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి

ఒంగోలు: వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్ కటారి శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి నగర మేయర్ గంగాడ సుజాత ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. పార్టీ ముఖ్యనాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఓటు హక్కుపై దివ్యాంగులకు రేపు అవగాహన సదస్సు

ఒంగోలు సెంట్రల్: సాధారణ ఎన్నికల నేపథ్యంలో దివ్యాంగులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉన్న సౌకర్యాలపై ఈ నెల 16వ తేదీ అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు దివ్యాంగులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి.అర్చన తెలిపారు. దివ్యాంగుల ఓటు హక్కు నమోదుకు కూడా ఆ రోజు ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఓటు హక్కు నమోదుకై ఆధార్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, పదో తరగతి సర్టిఫికెట్ జెరాక్స్ కాపీలు వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు కార్యాలయ ఫోన్ నంబర్ 08592–281310ను సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి జిల్లాస్థాయి ఆటలు పోటీలు

కొత్తపట్నం: జిల్లాస్థాయి పాలిటెక్నిక్ ఆటలు పోటీలు ఈ నెల 15, 16 తేదీల్లో ఈతముక్కల ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించనున్నట్లు ఎస్‌యుపీఆర్, ఎస్‌ఆర్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ వి.ఏసు ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. వాలీబాల్, బాడ్మింటన్, ఖోఖో, టెబుల్ టెన్నిస్, చదరంగం, 100 మీ, 200 మీ, 400 మీ, 800మీ, 100–4 రిలే పరుగుల పందెం పోటీల్లో 7 ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీల నుంచి 200 మంది విద్యార్థినులు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రారంభోత్సవానికి ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, తిరుపతి నుంచి సాంకేతిక విద్యాశాఖ ప్రాంతీయ సంచాలకులు ఏ.నిర్మల్‌కుమార్ ప్రియ హాజరవుతారని తెలిపారు. 16న ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి హాజరై బహుమతులు ప్రదానం చేస్తారని ప్రిన్సిపాల్ తెలిపారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విద్యార్థినీలు జనవరిలో అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

టైర్లే రక్ష..

పంట పండించడం ఒక ఎత్తయితే.. దానిని కాపాడుకునేందుకు పడే కష్టాలు అన్నీ ఇన్నీ కాదు..పొలాలను రక్షించుకునేందుకు ఈ ప్రాంత రైతులు వినూత్న పద్ధతులు అవలంభిస్తున్నారు. చున్నీలు కంచెలాగా కట్టి కాపాడుకుంటున్నారు. సుగంధ పంటల కోసం రైతులు పాత టైర్లతో కంచెను ఏర్పాటు చేసి అందర్నీ ఆకట్టుకుంటున్నాడు.

- పందుల బెడద నుంచి పంటను కాపాడేందుకు..
- వినూత్న రీతిలో పైరుకు టైర్లను కంచెగా ఏర్పాటు
- సముద్ర తీరంలో కూరగాయలతో పాటు నిమ్మగడ్డి, ఒట్టివేరు, సాగు చేస్తున్న రైతులు
- జిల్లాలో సుగంధ పంటలపై పెరుగుతున్న ఆసక్తి
- ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

పాదర్తిలో పొలం చుట్టూ వేసిన టైర్లతో కంచె



సాక్షిప్రతినిధి, ఒంగోలు

జిల్లాలో వాణిజ్య పంటల సాగు వైపు రైతులు ఆసక్తి చూపుతున్నారు. అనాధిగా సంప్రదాయ, ఆహార, నూనెగింజల పంటలు, పండ్ల తోటలతో పాటు పత్తి, పొగాకు పంటలను జిల్లాలో విస్తృతంగా సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకు వాణిజ్య పంటలు సాగు చేస్తున్నా..ప్రస్తుతం అధిక ఆదాయానిచ్చే సుగంధ పంటల సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. గతంలో ఒకరిద్దరు రైతులు మాత్రమే సుగంధ పంటల సాగు చేసేవారు. అయితే కేంద్ర ప్రభుత్వం సుగంధ పంటల సాగును ప్రోత్సహించేందుకు అరోమా మిషన్‌ను ఏర్పాటు చేసింది. 2016లో ఏర్పాటైన ఈ మిషన్ ఇప్పటికే రెండు విడతల్లో రైతులను ప్రోత్సహించగా..మూడో ఫేజ్‌లో కూడా రైతులను ప్రోత్సహించేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

అరోమా మిషన్ ద్వారా ప్రోత్సాహం..

అరోమా మిషన్ ద్వారా సుగంధ పంటల సాగుకు జిల్లా వ్యాప్తంగా ఔత్సాహికులైన రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ప్రస్తుతం గడ్డి రకం జాతులను ఎంపిక చేసి సుగంధ పంటలను సాగు చేస్తున్నారు. అందులో భాగంగా వట్టివేరు పంటల సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతం రైతులు విరివిగా సుగంధ పంటల సాగును చేపడుతున్నారు. దాదాపు 20 మండలాల్లోని రైతులు ఈ రకం పంట సాగుకు ముందుకు వచ్చారు. ముఖ్యంగా లెమన్ గ్రాస్, వట్టి వేరు పంటల సాగు చేస్తున్నారు. ఈ పంటను కొత్తపట్నం మండలంలోని పాదర్తి, పిన్నింటివారిపాలెం గ్రామాల్లో రైతులూ సాగు చేస్తున్నారు.



వట్టివేరు పంట

పంటలను కాపాడుకునేందుకు వినూత్న ప్రయోగం

అయితే ఈ పంటలను కాపాడుకునేందుకు రైతులు వినూత్న ప్రయోగాలు చేస్తున్నారు. ఈ పంటల సాగుకు ఖర్చు ఎక్కువ కావడంతో ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా రూ.లక్షల్లో నష్టం వచ్చే అవకాశం ఉంది. దీంతో రైతులు పంటలను కాపాడుకునేందుకు సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టారు. చుట్టుపక్కల వాడేసి నిరుపయోగంగా ఉన్న టైర్లను తీసుకువచ్చి పంటకు కంచెలా ఏర్పాటు చేస్తున్నారు. గతంలో చీరలు కట్టి కంచెలు ఏర్పాటు చేసేవారు. ప్రస్తుతం లారీ, బస్సుల టైర్లను పొలానికి కంచెలా ఏర్పాటు చేసి పంటలను కాపాడుకుంటున్నారు.

సుగంధం ముడి చమురు

సుగంధ పంటలు సాగు చేస్తున్న రైతులే స్వయంగా సుగంధం ముడి చమురును తీసే ప్రక్రియను కూడా చేపడుతున్నారు. పంటలు సాగు చేస్తున్న గ్రామాల్లోనే ఆవిరి ద్వారా ఉడకబెట్టే ప్రక్రియ(డిస్టిలేషన్) ద్వారా ముడి సుగంధ ఆయిల్‌ను తీస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో అర టన్ను, టన్ను సామర్థ్యంతో కూడిన డిస్టిలేషన్ యూనిట్లను నెలకొల్పి ఉపాధి పొందుతున్నారు. ఈ డిస్టిలేషన్ యూనిట్‌కు ప్రభుత్వం మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ హార్టికల్చర్(ఎంఐడీహెచ్)పథకం ద్వారా 40 శాతం సబ్సిడీతో డిస్టిలేషన్ యూనిట్లను మంజూరు చేసి రైతులను ప్రోత్సహిస్తోంది.

కష్టానికి తగిన ప్రతిఫలం...

సుగంధ పంటల సాగులో రైతులకు కష్టానికి తగిన ప్రతిఫలం లభిస్తోంది. వట్టివేరు పంటకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. ఎకరాకు 2.50 టన్నుల మేర పంట దిగుబడి వస్తుంది. లీటరు ఆయిల్ ధర రూ.14000 పలుకుతోంది. వట్టివేరు గడ్డిని కూడా విడిగా కొనుగోలు చేస్తున్నారు. టన్ను వట్టివేరు గడ్డి ధర రూ.1.05 లక్షలు పలుకుతోంది. అయితే సాగు ఖర్చు రూ.1.50 లక్షల వరకు అవుతుంది. ఏడాదికి ఖర్చులు పోను నికరంగా రూ.1.25 లక్షల నుంచి రూ.1.60 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉంది.

పంట మార్పిడి ద్వారా ప్రయోజనం



పొలంలో పంట మార్పిడి ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయి. భూమిని సారవంతం చేసుకోవటానికి ఎంతో ఉపయోగకరంగా మారింది. వట్టివేరు పంటను సాగు చేశాం. ఆయిల్ తీయటంతో పాటు విడిగా వట్టి వేరు గడ్డిని కొనుగోలు చేసుకొని పోతున్నారు. వట్టివేరు పంట తరువాత అధునాతన పద్ధతిలో బంగాళాదుంపను సాగుచేయబోతున్నాం.

– గోనుగుంట సుబ్బారావు, కొత్తపట్నం

పొలానికి కంచెలా



ఒంగోలుకు చెందిన సయ్యద్ జలీల్ కొత్తపట్నం మండలం పాదర్తిలో కొంత పొలం కొనుగోలు చేసుకొని సుగంధ పంటల సాగు చేపట్టారు. అయితే సముద్ర తీరంలో పంటలకు పందుల బెడద అధికంగా ఉంది. దీంతో పందుల బెడద నుంచి పంటలను కాపాడుకునేందుకు వాడి పడేసిన లారీల, బస్సుల టైర్లను సేకరించాడు. ఒంగోలు నగరంలో పక్కన పడేసిన పాత టైర్లను సేకరించి పాదర్తిలోని పొలం చుట్టూ కంచెమాదిరిగా ఏర్పాటు చేసుకున్నాడు. నల్లటి రంగుతో పాటు వరుసగా టైర్లు ఉంటే పందులు ఆ దరిదాపులకు కూడా రాకుండా పోతుండటాన్ని గమనించి పొలం చుట్టూ ఏర్పాటు చేయటంతో పూర్తి స్థాయి రక్షణగా మారింది. పక్క పొలాల్లోకి వచ్చిన పందులు సుగంధ పంటలతోపాటు వేరు శనగ పంటలను నాశనం చేస్తున్నాయి. కానీ టైర్లు చుట్టూ ఉన్న పొలం వైపు పందులు కన్నెత్తి కూడా చూడటం లేదని రైతులు చెబుతున్నారు.



పంట కోత తరువాత వట్టివేర్ల కుదుళ్లు

దళితులకు సముచిత స్థానం: మంత్రి సురేష్



మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళితులకు సముచిత స్థానం కల్పించారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనార్టీలు అంటూ జగనన్న రాజకీయాల్లో సమాన హక్కు కల్పించి, కేబినెట్‌లో స్థానం కేటాయించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. స్థానిక ఎన్జీఓస్ కాలనీలో నియోజకవర్గ పాస్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కులమతాలకు అతీతంగా పేదలందరికీ మేలు చేసేలా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. దళితుల పిల్లలు అందరితో సమానంగా విద్యను అభ్యసించాలని, ఉన్నత స్థాయికి ఎదగాలన్న మహోన్నత ఆలోచనతో సీఎం ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం అమలు చేశారని చెప్పారు. తల్లిదండ్రులకు భారం కాకుండా ఉచితంగా స్కూల్ డ్రస్, పాఠ్యపుస్తకాలు అందచేయడంతోపాటు తల్లుల అకౌంట్‌లలో రూ.15వేలు జమ చేస్తున్నారన్నారు. క్రైస్తవమనేది ఒక మతం కాదని, జీవన విధానమని, ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలన్న బోధన అన్ని మతస్తులకు వర్తిస్తుందని చెప్పారు. జీసస్ చూపిన బాటలో నడవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిష్టిన, హార్వెస్ట్ ఇండియా అధినేత డాక్టర్ సురేష్‌కుమార్, ఉయ్యూరు హోప్ వైద్యశాల ఎండీ డాక్టర్ ఎం.జాన్‌డేవిడ్, ఒంగోలు మూర్తిరెడ్డి, యర్రగొండపాలెం, పెద్దారవీడు మండలాల ఎంపీపీలు దొంతా కిరణ్‌గౌడ్, బెజవాడ గురవయ్య, జెడ్పీటీసీలు చేదూరి విజయభాస్కర్, యేర్వ చలమారెడ్డి, వైఎస్సార్ క్రిష్టియన్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు చేదూరి కన్న, ఏఎంసీ మాజీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, పాస్టర్ల సంఘం అధ్యక్షుడు సన్నెపోగు సుందరరావు, ఆర్యవైశ్య సంఘం నాయకుడు ఐ.వి.సుబ్బారావు పాల్గొన్నారు.

అందరి సహకారంతో ముందుకు



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి



జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను సన్మానిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

● జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున

చీమకుర్తి: సంతనూతలపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని బలోపేతం చేసేందుకు పార్టీ కార్యకర్తలందరినీ కలుపుకుపోతానని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ సమన్వయకర్త మేరుగు నాగార్జున అన్నారు. నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన తర్వాత తొలిసారిగా గురువారం నియోజకవర్గానికి వచ్చారు. తొలుత జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌లను వారి స్వగృహంలో కలిశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి సమక్షంలో ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న టీజేఆర్ సుధాకర్‌బాబును కలుపుకొని పార్టీని పటిష్టపరిచేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, పార్టీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, గోగినేని వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ బాపతు వెంకటరెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

గడువు లోగా అర్జీలను పరిష్కరిస్తాం



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఓటర్ల జాబితా సవరణ కోసం వచ్చిన అర్జీలను ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గడువు లోగా పూర్తి చేస్తామని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో గురువారం ప్రకాశంభవనంలో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీ అర్ధరాత్రి వరకు వచ్చిన దరఖాస్తులను ఈ నెల 26వ తేదీ నాటికి పరిష్కరించాలని ఎన్నికల కమిషనర్ గడువు పెట్టినట్లు తెలిపారు. గడువు లోగా పరిష్కారం చేయాల్సి అర్జీలు 72వేలు ఉన్నాయన్నారు. ఆన్‌లైన్‌లో వచ్చిన అర్జీలు పరిష్కరించేందుకు 7రోజుల తర్వాత అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం పరిష్కరించాల్సిన 72వేలలో సుమారు 50వేల అర్జీలు ఇంకా ఎనబుల్ స్థాయికి రాలేదన్నారు. ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పుల కోసం అర్జీలు పెట్టుకోవడం నిరంతర ప్రక్రియ అని తెలిపారు. 9వ తేది తర్వాత వచ్చిన అర్జీలు కూడా పరిష్కరించి అనుబంధ ఓటర్ల జాబితా ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో డీఆర్ఓ శ్రీలత, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, వైఎస్ఆర్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు స్వరూప్, రాజశేఖర్, సత్యనారాయణ, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

■ సమావేశం అనంతరం వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్ కలెక్టర్‌ను కలిసి జిల్లాలో నకిలీ ఓట్లు, రెండు, మూడు ప్రాంతాల్లో ఉన్న ఓట్లు ఉన్నాయని వాటిని పరిశీలించి తొలగించాలని ఫిర్యాదు చేస్తూ వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని అన్నీ నియోజకవర్గాల్లో ఇటువంటి ఓట్లు ఉన్నాయని, ఆ వివరాలకు సంబంధించిన సీడీని అందచేశారు. తెలంగాణ ఎన్నికల అనంతరం తెలంగాణ ప్రాంతం నుంచి ఆన్‌లైన్‌లో ఫారం–6, 8 ద్వారా నకిలీ ఓట్లు చేరుతున్నాయని వివరించారు. పరిశీలించి అరికట్టాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

17 నుంచి సచివాలయాల వద్ద రేషన్ పంపిణీ వాహనం

ఒంగోలు అర్బన్: ఏదైనా కారణాలతో ఇంటి వద్దకు వచ్చిన రేషన్ పంపిణీ వాహనం వద్ద సరుకులు తీసుకొని కార్డుదారుల కోసం ప్రతి నెల 17వ తేదీ మధ్యాహ్నం నుంచి వాహనం సచివాలయాల వద్ద అందుబాటులో ఉంటుందని సివిల్ సప్లయిస్ అధికారి ఉదయభాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్డుదారులు సద్వినియోగం చేసుకుని సరుకులు పొందాలన్నారు. ప్రజా పంపిణీలో ఏవైనా సమస్యలు ఉంటే 1967 నంబర్‌కు తెలియచేయాలని పేర్కొన్నారు.

ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఇంటర్మీడియెట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులను పూర్తి స్థాయిలో సన్నద్ధం చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రకాశం భవనంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, మోడల్ స్కూల్స్, కేజీబీవీ, జూనియర్‌కాలేజీలు, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్లతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 1వ తేదీ నుంచి జరిగే ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు సిద్ధం చేసిన 60 రోజుల ప్రత్యేక ప్రణాళికను అన్నీ కాలేజీల్లో పక్కాగా అమలు చేయాలన్నారు. ప్రణాళికను సరిగ్గా అమలు చేస్తున్నారా లేదా అనే అంశాన్ని పర్యవేక్షించేందుకు ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణులయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ప్రతి కాలేజీలో 80శాతం ఉత్తీర్ణత ఉండాలన్నారు. లేకుంటే కాలేజీల ప్రిన్సిపాల్, బోధనా సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చదివించాలన్నారు. మెరిట్ విద్యార్థులు ర్యాంకులు సాధించేలా శిక్షణ ఇవ్వాలన్నారు. పరీక్షలకు ముందు పేరెంట్ మీటింగ్ నిర్వహించి విద్యార్థుల చదువు తీరును తెలియచేయాలన్నారు. సమావేశం అనంతరం అండర్–19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తరుపున ఖోఖో, చపక్ తక్రా, బేస్‌బాల్, క్రీడల్లో జిల్లా స్థాయి నుంచి జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఐఓ సైమన్‌విక్టర్, డీఐఈఓ శ్రీనివాసరావు, స్కూల్‌గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి ఆదినారాయణ, జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షునిగా కుప్పం ప్రసాద్

ఒంగోలు: వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షునిగా ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్‌ను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటన విడుదల చేసింది. ఆయనతో పాటు రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీలో జిల్లా నాయకులకు అవకాశం లభించింది. వాణిజ్య విభాగంలో ప్రధాన కార్యదర్శిగా పులిపాటి హరీష్, డాక్టర్ కాటికల ప్రశాంత్‌కుమార్, కార్యదర్శిగా పెండ్యాల హనుమంత కిరణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా దోగిపర్తి రంజిత్ కుమార్, యక్కల శేషగిరిరావు, కూనం పూర్ణచంద్రరావులను నియమించారు. బీసీ సెల్ రాష్ట్ర కమిటీలో జోనల్ 5 ఇన్‌చార్జిగా బొట్ల రామారావు, ప్రధాన కార్యదర్శిగా యన్నాబత్తిన వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా దాసరి కరుణాకర్‌లను నియమించారు. రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ కమిటీ కార్యదర్శిగా జి.రెబ్కా, రాష్ట్ర మైనార్టీ సెల్ కమిటీ సంయుక్త కార్యదర్శులుగా ఎం.బాషా, షేక్ షావలిలను నియమించారు. రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా మారెడ్డి సుబ్బారెడ్డి(ప్రస్తుతం భారత పొగాకు బోర్డు సభ్యులు), ప్రధాన కార్యదర్శిగా అన్నెం వెంకట్రామిరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా గుంటక సుబ్బారెడ్డిలను నియమించారు.

ఏఎన్‌యూ డిగ్రీ ప్రథమ సంవత్సరం పరీక్షలు వాయిదా

● చివరి సంవత్సరం 5వ సెమిస్టర్ పరీక్షలు యదాతథంగానే..

ఒంగోలు: ఆచార్య నాగార్జున యూనివర్శిటీ పరిధిలో డిగ్రీ ప్రథమ సంవత్సరం పరీక్షలు వాయిదా వేసినట్లు పరీక్షల విభాగం అదనపు కంట్రోలర్ రెడ్డి ప్రకాశరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాస్తవానికి మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈనెల 12వ తేదీ నుంచి ప్రారంభం కావాల్సి ఉందని, కానీ రెగ్యులర్ మొదటి సెమిస్టర్ పరీక్షలను ఈనెల 27 నుంచి నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. మొదటి సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు 2024 జనవరి 19వ తేదీన ప్రారంభమవుతాయని, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. అయితే ముందుగా ప్రకటించినట్లుగానే ఈ నెల 27 నుంచి ప్రారంభమయ్యే బీఎస్సీ, బీబీఏ తృతీయ సంవత్సరం 5వ సెమిస్టర్ పరీక్షల నిర్వహణలో ఎటువంటి మార్పు ఉండదన్నారు. కాలేజీల ప్రిన్సిపాళ్లు, విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.


నేడు పెద్దదోర్నాలలో 'జగనన్నకు చెబుదాం'

పెద్దదోర్నాల: మండల కేంద్రమైన పెద్దదోర్నాలలో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని గురువారం కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వేణుగోపాలరావు పేర్కొన్నారు. మండల ప్రజలు తమ సమస్యలపై కలెక్టర్‌కు అర్జీలు అందజేయవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు.

మాన్యువల్ స్కావెంజింగ్ నిషేధంపై ప్రత్యేక దృష్టి

● సఫాయి కర్మచారీల పునరావాస చట్టంపై సమీక్షలో జేసీ శ్రీనివాసులు

ఒంగోలు సెంట్రల్: మాన్యువల్ స్కావెంజింగ్ నిషేధం, సఫాయి కర్మచారుల పునరావాస చట్టం-2013 అమలుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా సంయుక్త కలెక్టర్ కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం జేసీ కార్యాలయంలో మాన్యువల్ స్కావెంజింగ్ నిషేధంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అక్టోబర్ 30న నిర్వహించిన సమావేశంలో తీర్మానాలకు సంబంధించి చేపట్టిన చర్యలపై జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. సోషల్ వర్కర్ మిట్నసల బెంజిమన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ జనరల్ హాస్పిటల్లో సఫాయి కర్మచారీలు, సెక్యూరిటీ గార్డులను ఆప్కోస్‌లో కలపాలని కోరారు. ఏజెన్సీ వచ్చినప్పటి నుంచి రూ.9 వేలు మాత్రమే వేతనం చెల్లిస్తున్నారని, లేబర్ యాక్ట్ ప్రకారం ఆరు నెలలకు ఒకసారి వేతనం పెంచడం లేదని చెప్పారు. సఫాయి కర్మచారీలను ఏ పద్ధతిలో తీసుకున్నారో వివరాలు తెలపాలని, ఆపరేషన్ థియేటర్‌లో పనిచేస్తున్న వారికి షిఫ్ట్ డ్యూటీలు ఏర్పాటు చేయాలని కోరారు. ఏపీఎస్ఆర్‌టీసీలో శానిటేషన్ వర్కర్లు 23 మందిని, గ్యారేజీలో ఉన్న ఐదుగురితోపాటు జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న వారిని కూడా ఆప్కోస్‌లో విలీనం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏపీఎస్ఆర్‌టీసీలో ఈఎస్ఐ మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఈడీ ఎన్. లక్ష్మానాయక్, కమిటీ సభ్యులు జిల్లా పంచాయతీ అధికారి జీవీ నారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు, మార్కాపురం మున్సిపల్ కమిషనర్ బీఎస్ గిరికుమార్, పంచాయతీరాజ్ ఎస్ఈ కె.కొండయ్య, హౌసింగ్ పీడీ పేరయ్య, డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



మొదటి దేవరాయల కాలంనాటి శాసనం

కొత్తిపి చాళుక్యులు.. విజయనగర రాజులు.. కాకతీయ రాజులు.. శాయపునాయుడి వంశస్తుల పాలనలో ఎందరో చక్రవర్తులు, మహారాజులు నడయాడిన నేల పశ్చిమ ప్రకాశం. గతమెంతో ఘనమైన చరిత్రను నింపుకుంది ఈ ప్రాంతం. దట్టమైన అటవీప్రాంతం.. కొండలు.. కోనలు.. లోయలు.. ఇరుకైన రహదార్లు ఉన్న నల్లమల అటవీ ప్రాంతం ఆనాడు రక్షణ కవచంగా ఉండేది. చరిత్రకారుల పరిశోధనల్లో లభ్యమవుతున్న పలు శాసనాలు వీటిని ధ్రువీకరిస్తున్నాయి. 5 వేల ఏళ్ల నాటి కొత్తరాతియుగానికి చెందిన పురాతన మానవుల సమాధులు సైతం ఇక్కడ బయటపడ్డాయి. ఎంతో చారిత్రక నేపథ్యమున్న ఈ ప్రాంతంలోని ఆసక్తి కలిగించే అంశాలు ఎన్నో ఉన్నాయి. వాటి గురించి తెలుసుకుందా మరి..

– ఒంగోలు డెస్క్

అడవిలో అనంత చరిత్ర!

● రాజుల కాలంలో శత్రు దుర్భేద్యంగా పశ్చిమ ప్రకాశం
● కొత్తిపి చాళుక్యులు, గజపతులు, కాకతీయులు, రాయల వంశస్తుల శాసనాలు లభ్యం
● పశ్చిమాన 5 వేల ఏళ్ల నాటి కొత్త రాతియుగం ఆనవాళ్లు
● చారిత్రక ఆధారాలపై పరిశోధనలు

యర్రగొండపాలెం మండలం రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తురిమెళ్ల శ్రీనివాస్ చేసిన పలు పరిశోధనల్లో శతాబ్దాల చరిత్రకు ఆనవాళ్లుగా నిలిచే శాసనాలు లభ్యమయ్యాయి. వీటిని ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ మునిరత్నం రెడ్డి ధ్రువీకరించారు. పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, యర్రగొండపాలెం, దర్శి నియోజకవర్గాల్లో పలు ప్రాంతాలకు పురాతన, చారిత్రక నేపథ్యముంది. ఈ ప్రాంతాన్ని కొత్తిపి చాళుక్యులు.. విజయనగర రాజులు.. కాకతీయ రాజులు, అలాగే శాయపునాయుడి వంశస్తులు పాలించారని తెలియజేసే ఎన్నో ఆధారాలు పదిలంగా ఉన్నాయి. 11వ శతాబ్దం ప్రారంభానికి చెందిన కొత్తిపి చాళుక్యుల సామ్రాజ్యానికి చెందిన శాసనం పుల్లలచెరువు మండలం శతకోడులో లభ్యమైంది. విజయనగర సామ్రాజ్యంలో రెండో బుక్కరాయల కుమారుడు మొదటి దేవరాయలు ఈ ప్రాంతానికి వచ్చివెళ్లారు. ఇందుకు సంబంధించి యర్రగొండపాలెం మండలంలో దట్టమైన అటవీ ప్రాంతమైన పొన్నలబైలు వద్ద శాసనం లభ్యమైంది. 12, 13వ శతాబ్దాల్లో పాలించిన కాకతీయ సామ్రాజ్యానికి చెందిన ప్రతాపరుద్రుని శాసనం దొనకొండ మండలం కొచ్చెర్లకోట శివాలయం సమీపంలో బయటపడింది. ఈ ప్రాంతానికి రుద్రమదేవి, అంబదేవుడు, ప్రతాపరుద్రుడు, గణపతి దేవుడు వచ్చి వెళ్లినట్టు శాసనం ద్వారా తెలుస్తోంది.

దూపాడు పరగణా, కొచ్చెర్లపాడు సీమ పేరుతో కాకతీయులు పరిపాలించారు. కాకతీయ సామ్రాజ్యం పతనమయ్యాక విజయనగర రాజులు పాలన మొదలైంది. శాయపునాయుడి వంశస్తులు(కమ్మరాజులు) శ్రీకృష్ణదేవరాయలు సామ్రాజ్యంలో దూపాడు పరగణా సంస్థానాధీశులు. వీరు దట్టమైన అటవీ ప్రాంతంలో దద్దనాల వద్ద కోట నిర్మించుకున్నారు. పెద్ద పట్టణాన్ని ఏర్పాటు చేసుకున్నారు. 1512లో కృష్ణదేవరాయలు శాయపునాయుడి వంశస్తులను పాలించమని అవకాశమిచ్చారు. ఆ తర్వాత తురుష్కుల దాడిలో మొత్తం పట్టణంతోపాటు, కోట ధ్వంసమైంది. తర్వాత వారు యర్రగొండపాలెం వచ్చారు. ఇందుకు సంబంధించి బోయలపల్లి వద్ద శాసనం లభ్యమైంది. దద్దనాల కోటలో పెద్ద కోనేరు ఉంది. ఇక్కడ రోళ్లు ఇప్పటికీ ఉన్నాయి. శ్రీకాకుళానికి చెందిన గజపతి రాజు తెలుగు రాయుడు పెద్ద చెరువు కట్టించారు.



కొచ్చెర్లకోట రామలింగేశ్వరస్వామి ఆలయంలో లభ్యమైన కాకతీయరాజు ప్రతాపరుద్రుని కాలం నాటి శాసనం

శ్రీశైలం వయా త్రిపురాంతకం

పూర్వం ఎందరో మహరాజులు, వర్తకులు త్రిపురాంతకం మీదుగా శ్రీశైలానికి వెళ్లేవారు. త్రిపురాంతకం నుంచి అమానిగుడిపాడు, దద్దనాల, పాలంక మీదుగా శ్రీశైలానికి వెళ్లేవారు. వీరు తమ సైన్యం, గుర్రాలు, ఏనుగులు సేదతీరేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు. సైనికుల కోసం సానికవరం, గుర్రాలు కట్టేసేందుకు గుర్రపుశాల, ఏనుగుల కోసం ఏనుగులదిన్నెపాడు ప్రాంతాలు ఉండేవి. దోర్నాల, పెద్దారవీడు, యర్రగొండపాలెం మండలాల్లో ఇప్పటికీ అదే పేర్లతో గ్రామాలు ఉన్నాయి.



చక్రాలబోడు వద్ద కొండరాళ్లపై పురాతన చిత్రాలు

కొత్త రాతియుగం ఆనవాళ్లు

పుల్లలచెరువు మండలంలోని చక్రాలబోడు వద్ద కొత్త రాతియుగానికి చెందిన ఐదు వేల ఏళ్లనాటి ఆనవాళ్లు లభ్యమయ్యాయి. ఇక్కడ పురాతన మానవుల సమాధులను ఇటీవల గుర్తించారు. కొండ రాళ్లపై ఆనాటి మానవులు చెక్కిన ఎద్దులు, మేకలు, మనుషుల ఆకృతులు వెలుగుచూశాయి. అలాగే త్రిపురాంతకం మండలం బొంకురవారిపాలెం వద్ద ఒకటో శతాబ్దం నాటి బౌద్ధ శిల్పం లభ్యమైంది.



శత్రుజాడ కనిపెట్టేలా..

ఇరుకుదారులు.. కొండాకోనలు ఉండటంతో శత్రువుల ఆనవాళ్లను కనిపెట్టేందుకు చక్రవర్తులు ఆనాడు ఈ ప్రాంతాన్ని రక్షణ కవచంగా వినియోగించుకున్నారు. ఇక్కడ అనేక బురుజులు సైతం నిర్మించుకున్నారు. మొదటి దేవరాయలు తరుచూ ఈ ప్రాంతానికి వచ్చి వెళ్తుండేవారని తెలుస్తోంది. ఈ దట్టమైన కీకారణ్యాన్ని శ్రీకృష్ణదేవరాయలు తమ ప్రాంతంగా నిర్ధారించుకున్నారు కూడా. నల్లమల శత్రు దుర్భేద్యమైన ప్రాంతంగా నిలిచిందనడంలో ఎలాంటి సందేహం లేదు. మొదటి దేవరాయలు కాలనికి చెందిన ఒక శాసనం లభ్యమవడంతో ఈ విషయాలు అవగతమవుతున్నాయి.

నలుగురు శిల్పులు చెక్కిన త్రిపురాంతకేశ్వరాలయం

13వ శతాబ్దానికి చెందిన శాసనం త్రిపురాంతకం కొండపైన బయటపడింది. దీని ఆధారంగా ఇక్కడ త్రిపురాంతకేశ్వరుని ఆలయ నిర్మాణానికి ఆనాడు ప్రముఖ శిల్పులుగా పేరొందిన హరిజేతి, రామజేతి, ధగజేతి, సింఘన కృషి చేశారు. ఇందుకు సంబంధించి తెలుగు, సంస్కృతంలో వీరి పేర్లతో ఉన్న చిత్రాలు లభ్యమయ్యాయి.



ఆసక్తితోనే చారిత్రక పరిశోధన

కురిచేడు మండలంలో ఒక దేవస్థానానికి ధర్మకర్తగా ఉన్న సమయంలో సత్రం నిర్మిస్తుండగా కొన్ని పురాతన విగ్రహాలు లభ్యమయ్యాయి. అప్పటి నుంచి చారిత్రక పరిశోధనపై ఆసక్తి పెరిగింది. గుంటూరుకు చెందిన చరిత్రకారుడు మనిమేల శివశంకర్ ప్రోత్సాహంతో చరిత్రపై పరిశోధన కొనసాగించా. మర్రి చెన్నారెడ్డి హ్యూమన్ రిసోర్స్ సెంటర్ ప్రచురించిన ఎపిగ్రాఫికా-తెలంగాణికా అనే పుస్తకంలో నేను కనుగొన్న కాకతీయ కాలం నాటి శాసనాన్ని ముద్రించారు. అలాగే మొదటి దేవరాయలు కాలానికి చెందిన శాసనానికి కరెంట్ అఫైర్స్‌లో స్థానం దక్కింది. తాను గుర్తించిన శాసనాలన్నీ భారత ఆర్కియాలజీ విభాగం డైరెక్టర్ మునిరత్నంరెడ్డికి పంపగా ధ్రువీకరించి పరిశోధన దిశగా ప్రోత్సహించారు.

– తురిమెళ్ల శ్రీనివాస్, చరిత్రకారుడు, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్, యర్రగొండపాలెం



ఒంగోలులో తనిష్క్ షోరూం ప్రారంభం



తనిష్క్ షోరూంను ప్రారంభిస్తున్న సీఈవో అజోయ్ చావ్లా

ఒంగోలు: టాటా గ్రూప్ సారథ్యంలోని దేశ అతిపెద్ద జ్యువెలరీ రిటైల్ బ్రాండ్ అయిన తనిష్క్ ఒంగోలులో నూతనంగా ఏర్పాటు చేసిన షోరూమ్‌ను టైటాన్ కంపెనీ లిమిటెడ్ జ్యువెలరీ డివిజన్ సీఈవో అజోయ్ చావ్లా గురువారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షోరూమ్ ప్రారంభోత్సవం సందర్భంగా తమ సంస్థ అద్భుతమైన ఆఫర్లు అందిస్తోందని, వినియోగదారులు ఆభరణాల కొనుగోలుతో ఉచిత గోల్డ్ కాయిన్‌ను పొందవచ్చని పేర్కొన్నారు. ఈ ఆఫర్ ఈనెల 16వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందన్నారు. స్టోర్‌లో బంగారం, వజ్రాలు, కుందన్, కాకతీయ రాచరిక కలెక్షన్, పోల్కీలో ఐకానిక్ తనిష్క్ డిజైన్ల విస్తృతమైన కలెక్షన్‌ను అందిస్తున్నట్లు వివరించారు. పెండెంట్ల నుంచి నెక్లెస్‌ల వరకు స్ట్రింగ్ ఇట్ కలెక్షన్ ప్రతి సందర్భంలోనూ స్టైల్ కోటీన్‌ను ఎలివేట్ చేసేందుకు రూపొందించినట్లు పేర్కొన్నారు. హైవాల్యూ స్టడెడ్ జోన్, రివాహ్ నుంచి అద్భుతమైన ఆఫర్లు ఉన్నాయన్నారు. ఇది తమ సంస్థ డెడికేటెడ్ వెడ్డింగ్ జ్యువెలరీ సబ్ బ్రాండ్, వివాహ సంబంధ వినియోగదారుల అవసరాలను తీరుస్తుందన్నారు. తాము చేసే ప్రతిపనిలో కస్టమర్ సంతృప్తిని ప్రధానంగా తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

నారాయణస్వామి ఆలయానికి రూ.84.81 లక్షల ఆదాయం

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణ స్వామి ఆలయానికి రూ.84,81,500 ఆదాయం సమకూరినట్లు ఈవో గణపం రమణారెడ్డి, చైర్మన్ కొమ్మినేని చినఆదినారాయణ పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో పూజా సామగ్రి, ప్రసాదం, ఇతర వస్తు విక్రయ దుకాణాల నిర్వహణకు సంబంధించి గురువారం కందుకూరు ఎండోమెంట్ అధికారి జీఏ సత్యనారాయణ ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించినట్లు తెలిపారు. హక్కుదారులు ఆలయ ప్రాంగణంలో 2024 ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి 2025 జనవరి 31వ తేదీ వరకు దుకాణాలు నిర్వహించుకోవచ్చని స్పష్టం చేశారు. గత ఏడాదికంటే రూ.8,22,800 అదనంగా ఆదాయం వచ్చిందని వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



వేలం నిర్వహిస్తున్న ఈవో, చైర్మన్

బాధ్యతలు స్వీకరించిన మార్కాపురం సీఐ

మార్కాపురం టౌన్: మార్కాపురం సీఐగా ఆవుల వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నెల్లూరులో ఎస్సీఎస్టీ సెల్ సీఐగా పనిచేస్తూ బదిలీపై మార్కాపురం వచ్చారు. గతంలో మార్కాపురం రూరల్, తర్లుపాడు ఎస్సైగా విధులు నిర్వర్తించారు. ఆయనను ఎస్సైలు కోటేశ్వరరావు, సువర్ణ, వెంకటేశ్వరనాయక్, ఏఎస్సైలు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.



సీఐ వెంకటేశ్వర్లు

కనిగిరి ఏఎంసీ చైర్మన్‌గా సాల్మన్‌రాజు

● సామాజిక సాధికారత దిశగా ప్రభుత్వం మరో అడుగు
● కనిగిరి నియోజకవర్గంలో ఎస్సీల అభ్యున్నతికి పెద్దపీట

కనిగిరి రూరల్: కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పట్టణంలోని పాతూరుకు చెందిన సీనియర్ న్యాయవాది, వైఎస్సార్ సీపీ నాయకుడు చింతగుంట్ల సాల్మన్‌రాజు నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏఎంసీ కమిటీ గౌరవ అధ్యక్షునిగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్, చైర్మన్‌గా సీహెచ్ సాల్మన్‌రాజు, మరో 13 మందిని కమిటీ సభ్యులుగా నియమించారు.

సాధికారతకు పెద్దపీట

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సామాజిక సాధికారత దిశగా మరో అడుగు వేసింది. నియోజకవర్గంలో ఎమ్మెల్యే స్థానం తర్వాత ప్రాధాన్యత కలిగిన ఏఎంసీ చైర్మన్ పదవిని ఎస్సీ సామాజికవర్గానికి చెందిన సాల్మన్‌రాజుకు కేటాయించారు. తద్వారా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో స్పష్టమవుతోంది. కనిగిరి నియోజకవర్గంలో అధికంగా ఉన్న ఎస్సీ సామాజికవర్గానికి చైర్మన్ పదవి కేటాయించడంపై బడుగులు హర్షం వ్యక్తం చేశారు.



సాల్మన్ రాజు

సీఎం, ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే బడుగు బలహీన వర్గాలు అభ్యున్నతి సాధిస్తున్నాయని ఏఎంసీ చైర్మన్ సాల్మన్‌రాజు పేర్కొన్నారు. పేద వర్గానికి చెందిన తనను ఏఎంసీ చైర్మన్‌గా చేసి సీఎం వైఎస్ జగన్ బలహీన వర్గాల పక్షాన నిలిచారని కొనియాడారు. పార్టీని నమ్ముకుని పనిచేసిన వారికి తప్పక గుర్తింపు లభిస్తుందనేందుకు తానే నిదర్శనమన్నారు. పదవి కేటాయించిన సీఎం వైఎస్ జగన్, అందుకు సహకరించిన ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్‌కు సాల్మన్‌రాజు కృతజ్ఞతలు తెలిపారు. బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ లబ్ధిని వివరించి రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా కృషి చేస్తానన్నారు.



సీఎం వైఎస్ జగన్‌తో సాల్మన్‌రాజు(ఫైల్)

టిప్పర్ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

మద్దిపూడి: టిప్పర్ అదుపుతప్పి బోల్తా పడిన సంఘటన మండలంలోని తిప్పలదేవిపల్లి గ్రామం వద్ద గురువారం చోటుచేసుకుంది. కూచిపూడి పంచాయతీ పరిధిలోని తిప్పలదేవిపల్లిలో శ్రీకృష్ణ గ్రానైట్ క్వారీలో గ్రావెల్ డంపింగ్ చేస్తున్న సమయంలో టిప్పర్ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రుడికి మెరుగైన వైద్యం అందించేందుకు ఒంగోలులోని ఓ ఆస్పత్రికి తరలించారు.

బాక్సింగ్‌లో జరుగుమల్లి విద్యార్థికి కాంస్యం

జరుగుమల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో జరుగుమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి లక్ష్మీ పవన్‌కళ్యాణ్ కాంస్య పతకం సాధించాడు. విజయనగరంలో ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించిన బాక్సింగ్ పోటీల్లో జరుగుమల్లి విద్యార్థులు పాల్గొనగా.. అండర్-17(80 ప్లస్) విభాగంలో లక్ష్మీ పవన్‌కళ్యాణ్ ప్రతిభ చాటినట్లు పాఠశాల హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు వివరించారు. విద్యార్థిని హెచ్ఎంతోపాటు పీడీ ఎన్‌టీ ప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.



బాక్సింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గెలుపే లక్ష్యంగా పనిచేయండి



ఎమ్మెల్సీ పోతుల సునీతను సన్మానిస్తున్న మహిళా విభాగం నాయకులు

● వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నేతలతో ఎమ్మెల్సీ పోతుల సునీత
● పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీకి ఘన సన్మానం

ఒంగోలు: పదవి పొందడం అంటే బాధ్యతను మరింతగా పెంచుకోవడమేనని గుర్తుంచుకోవాలని మహిళా విభాగం నాయకులకు ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత దిశానిర్దేశం చేశారు. గురువారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయానికి వచ్చిన పోతుల సునీతను నూతనంగా పదవులు పొందిన మహిళా నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పోతుల సునీత మాట్లాడుతూ.. 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సంక్షేమ పాలనను ప్రజలకు వివరించి అఖండ మెజార్టీతో పార్టీని గెలిపించుకుందామన్నారు. రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన దారా పద్మజ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి పదవిలో నియమించిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ పోతుల సునీతకు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళా సాధికారత, రక్షణ, సామాజిక న్యాయం కోసం సీఎం వైఎస్ జగన్ ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. ఏపీలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఇతర కార్యక్రమాలను దేశవ్యాప్తంగా నిర్వహించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం సైతం ముందుకు రావడం హర్షణీయమన్నారు. మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డి అరుణ మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడి పనిచేసేవారికి అవకాశం లభిస్తుందనేందుకు తానే నిదర్శనమన్నారు. మహిళా విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నక్కల లీలాకుమారి, జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, రీజినల్ కోఆర్డినేటర్ బడుగు ఇందిర తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాషన్

సంప్రదాయ వేడుకలకు గ్రాండ్‌గా తయారవ్వాలంటే అతివలు ఎంచుకునే మొదటి ఎంపిక లంగా ఓణీ లేదా గాగ్రా చోలీ అవుతుంది. ఎంబ్రాయిడరీ లాంటి రిచ్ డిజైన్స్ లేవు అనుకునేవారు రీసెంట్‌గా ఆకట్టుకుంటున్న డిజిటల్ ప్రింట్ డిజైన్స్‌ని ఎంపిక చేసుకోవచ్చు. పురాణ గాథలు, ఫ్లోరల్, గ్రామీణ వాతావరణం నింపుకున్న డిజిటల్ డిజైన్స్ రిచ్‌లుక్‌తో అట్రాక్ట్ చేస్తున్నాయి.

డిజిటల్ మెరుపులు











మెటీరియల్

సంప్రదాయ వేడుకలకు తక్కువ ఖర్చుతో ఎక్కువ కళగా సొంతం చేసుకోవాలనుకునేవారు ఈ డిజిటల్ ప్రింట్ డిజైన్స్‌ను ఎంచుకోవచ్చు. వీటిలో మెటీరియల్, డిజైన్ బట్టి ధరలు వేల రూపాయల నుంచి మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. రెడీ టు వేర్‌గానూ ఉన్న ఈ డిజైన్స్ అమ్మాయిలను, అమ్మలనూ ఆకట్టుకుంటున్నాయి.

కలంకారీ ప్రింట్స్

చందేరీ ఫ్యాబ్రిక్‌పైన పెన్ కలంకారీ మాత్రమే కాదు కలంకారీ ప్రింట్స్ కూడా కొత్త ఊపిరి పోసుకుంటున్నాయి. హ్యాండ్‌మేడ్ చేయించుకోవడానికి టైమ్ పడుతుంది అనుకునే వారు రెడీ టు వేర్‌గా ఉన్న కలంకారీ లెహంగా చోలీ డిజైన్స్‌ను ఎంచుకోవచ్చు.

పట్టుపైనా...

పట్టు లెహంగాలు ఎప్పుడూ రిచ్ లుక్‌ని ఇస్తాయి. అయితే, వీటిని మరింత గ్రాండ్‌గా తీర్చిదిద్దడానికి డిజిటల్ ప్రింట్స్ సందడి చేస్తున్నాయి. దుపట్టా, బ్లౌజ్, లెహంగా లు కొత్త లుక్‌తో మెరిసిపోతున్నాయి. సంప్రదాయ వివాహ వేడుకలు, పండుగల రోజుల్లో ఇవి కొత్త ప్రత్యేకతను నింపుకుంటున్నాయి.

వంటిల్లు

ఈ క్రిస్మస్‌కు సులభంగా... త్వరగా చేసుకోదగిన రుచికరమైన కుకీస్ ఈ వారం

రంగు రంగుల రుచులు


క్రిస్టమస్ సాఫ్ట్ కుకీస్



కావలసినవి: మైదా – మూడున్నర కప్పులు; వంటసోడా – టీస్పూను; ఉప్పు – అర టీస్పూను; పంచదార – ఒకటిన్నర కప్పులు; బటర్ – కప్పు; గుడ్లు – రెండు; వెనీలా ఎసెన్స్ – రెండు టీస్పూన్లు.

తయారీ: ● మైదా, వంటసోడా, ఉప్పుని ఒక గిన్నెలో వేసి కలిపి పక్కన పెట్టుకోవాలి ● బటర్‌లో పంచదార వేసి క్రీమ్‌లా మారేంత వరకు బీటర్‌తో కలపాలి. తరువాత ఈ క్రీమ్‌ను రెండు గంటలు రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి ● రెండు గంటల తరువాత బటర్ క్రీమ్‌లో గుడ్లసొన, వెనీలా ఎసెన్స్, మైదా మిశ్రమం వేసి ముద్దగా కలుపుకోవాలి ● పిండి ముద్దను రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి ● రెండు గంటల తరువాత పిండి ముద్దను రొట్టెల్లా వత్తుకోవాలి ● ఈ రొట్టెను క్రిస్టమస్ ట్రీ, స్టార్స్, బొమ్మల ఆకారంలో కట్ చేసి బేకింగ్ ట్రేలో పెట్టాలి. కుకీస్ ఆకారాన్ని బట్టి ఫుడ్ కలర్ వేసుకోవచ్చు ● ఈ బేకింగ్ ట్రేను 400 డిగ్రీల ఫారిన్ హీట్ వద్ద పదినిమిషాలు బేక్ చేస్తే ఎంతో రుచికరమైన క్రిస్టమస్ సాఫ్ట్ కుకీస్ రెడీ.

స్నీకర్ డూడుల్ కుకీస్



కావలసినవి: మైదా – మూడు కప్పులు; టార్టారిక్ యాసిడ్ – రెండు టీస్పూన్లు; కోషర్ సాల్ట్ – టీస్పూను; వంటసోడా – ముప్పావు టీస్పూను; బటర్ –కప్పు; పంచదార – ఒకటిన్నర కప్పులు; వెనీలా ఎసెన్స్– టీస్పూను; దాల్చినచెక్క పొడి – టేబుల్ స్పూను.

తయారీ: ● పెద్దగిన్నెలో మైదా, టార్టారిక్ యాసిడ్, వంటసోడా వేసి కలపాలి ● అన్నీ కలిసిన తరువాత బటర్, ఒకటింబావు కప్పుల పంచదార వేసి మెషిన్ మిక్సర్‌తో కలపాలి ● మిశ్రమం క్రీమ్‌లా మారిన తరువాత వెనీలా ఎసెన్స్ వేసి కలిపి రిఫ్రిజిరేటర్‌లో ఉంచాలి ● మిగిలిన పంచదారలో దాల్చినచెక్క పొడి వేసి బాగా కలిపి పక్కన పెట్టుకోవాలి ● గంట తర్వాత రిఫ్రిజిరేటర్‌నుంచి తీసిన మిశ్రమాన్ని రెండు టేబుల్ స్పూన్ల చొప్పున తీసుకుని బాల్స్‌లా చేసి దాల్చినచెక్క పొడి అద్ది బేకింగ్ ట్రేలో పెట్టాలి ● కుకీస్ అన్నీ తయారయ్యాక.. బేకింగ్ ట్రేని 350 డిగ్రీల ఫారిన్ హీట్స్ వద్ద, ఇరవై నిమిషాలు బేక్ చేస్తే స్నీకర్ డూడుల్ కుకీస్ రెడీ.

ఇటాలియన్ పీచ్ కుకీస్



కావలసినవి: మైదా – మూడున్నర కప్పులు; వంటసోడా – టేబుల్ స్పూను; కోషర్ సాల్ట్ – పావు టీస్పూను; బటర్ – అరకప్పు; పంచదార – రెండు కప్పులు; గుడ్లు – రెండు కప్పులు; వెనీలా ఎసెన్స్ – రెండు టీస్పూన్లు; పాలు – కప్పు; ఎరుపు, పసుపు ఫుడ్ కలర్ – నాలుగు చుక్కలు (ఒక్కోటి రెండు చుక్కలు). పీచ్ బటర్ క్రీమ్: బటర్ – పావు కప్పు; వెనీలా ఎసెన్స్ – అర టీస్పూను; కోషర్ సాల్ట్ – చిటికెడు; పంచదార పొడి – కప్పు; పీచ్ ప్యూరీ – రెండు టేబుల్ స్పూన్లు.

తయారీ: ● ఒక గిన్నెలో వంటసోడా, ఉప్పు వేసి కలపాలి ● దీనిలో బటర్, కప్పు పంచదార వేసి క్రీమ్‌లా మారేంత వరకు హ్యాండ్ మిక్సర్‌తో కలపాలి. తరువాత క్రీమ్‌ను పక్కన పెట్టుకోవాలి ● మిక్సర్‌ను తక్కువ స్పీడ్‌లో పెట్టి గుడ్ల సొన, వెనీలా ఎసెన్స్ వేసి రెండు నిమిషాలు బీట్ చేసుకోవాలి ● తరువాత మైదా, బటర్ మిశ్రమం అరకప్పు పాలు పోసి అన్ని చక్కగా కలిసేంత వరకు బీట్ చేయాలి ● ఇప్పుడు ఈ మిశ్రమాన్ని స్కూప్ పరిమాణంలో తీసుకుని గుండ్రని బాల్స్‌లా చేసి పైన కొద్దిగా వత్తి పీచ్ ఫ్రూట్ ఆకారంలోకి తీసుకు రావాలి ● ఇలా అన్ని కుకీస్ రెడీ అయిన తరువాత అవెన్‌లో పెట్టి 350 డిగ్రీల ఫారిన్ హీట్స్ వద్ద పదిహేను నిమిషాలు బేక్ చేయాలి ● పీచ్ క్రీమ్‌కోసం తీసుకున్న బటర్, వెనీలా ఎసెన్స్, కోషర్ సాల్ట్ లనుగిన్నెలో వేసి హ్యాండ్ మిక్సర్‌తో కలపాలి ● ఇవన్నీ చక్కగా కలిపిన తరువాత మిక్సర్ స్పీడు తగ్గించి పంచదార పొడి, పీచ్ ప్యూరీవేసి మీడియం హై లో నిమిషం పాటు మిక్సర్‌తో కలపాలి ● మిగిలిన అరకప్పు పాలను రెండు సగాలుగా చేసి రెండు వేర్వేరు గిన్నెల్లో పోయాలి. ఒకదానిలో ఎరుపు, మరో దానిలో పసుపు ఫుడ్ కలర్ వేసి కలిపి పక్కన పెట్టుకోవాలి. మరోగిన్నెలో మిగిలిన పంచదారను పెట్టుకోవాలి ● కుకీస్ బేక్ అయిన తరువాత..వేడిగా ఉన్నప్పుడే కుకీస్ మధ్యలో చిన్న గాటు పెట్టి.. మధ్యలో పీచ్‌క్రీమ్‌ను వేసి శాండ్‌విచ్‌లా కొద్దిగా వత్తాలి ● ఇప్పుడు కుకీకి ఒకవైపు ఎరు రంగు కలపిన పాలు, మరోవైపు పసుపు రంగు కలపిన పాలు అద్దాలి. చివరిగా పంచదార అద్దితే ఇటాలియన్ పీచ్ కుకీస్ రెడీ.

గ్రీన్ కేక్ మిక్స్ కుకీస్



కావలసినవి: వెనీలా కేక్ మిక్స్ – మూడు కప్పులు; నూనె – ముప్పావు కప్పు; గుడ్లు – రెండు; వెనీలా ఎసెన్స్ – అరటీస్పూను; గ్రీన్ ఫుడ్ కలర్ – టీస్పూను(జెల్); పంచదార పొడి – ముప్పావు కప్పు; హార్ట్ షేప్ క్యాండీస్ – గార్నిష్‌కు సరిపడా.

తయారీ: ● కేక్ మిక్స్,నూనె, గుడ్ల సొన, వెనీలా ఎసెన్స్‌ను, గ్రీన్‌ఫుడ్ కలర్‌ను ఒక గిన్నెలో వేసి ముద్దలా కలపాలి. తరువాత రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి ● ఇరవై నిమిషాల తరువాత పిండి ముద్దను బయటకు తీసి స్కూప్ పరిమాణంలో పిండిని తీసుకుని ఉండలు చేయాలి ● ఈ ఉండలను పంచదారపొడిలో ముంచి కోటింగ్‌లా అద్దాలి ● తరువాత ఉండలను బేకింగ్ ట్రేలో పెట్టి, కుకీ షేప్ వచ్చేలా వత్తుకోవాలి ● కుకీ మధ్యలో హార్ట్ ఆకారంలో ఉన్న క్యాండీని పెట్టి బేకింగ్ ట్రేని అవెన్‌లో పెట్టాలి ● 350 డిగ్రీల ఫారిన్ హీట్స్ వద్ద పదిహేను నిమిషాలు బేక్ చేస్తే గ్రీన్ కేక్ మిక్స్ కుకీస్ రెడీ.

సుగర్ కుకీస్



కావలసినవి: బటర్ – పావు కప్పు; క్రీమ్ చీజ్ – పావుకప్పు; పంచదార – ఒకటిన్నర కప్పులు; గుడ్లు – రెండు; వెనీలా ఎసెన్స్ – ఒకటిన్నర టీస్పూన్లు; బాదం ఎసెన్స్ – పావు టీస్పూను; మైదా – రెండున్నర కప్పులు; కార్న్‌స్టార్చ్ – టేబుల్ స్పూను; వంటసోడా – టీస్పూను; ఉప్పు – పావు టీస్పూను; ఎరుపు, పచ్చరంగు కలిపిన పంచదార –గార్నిష్‌కు సరిపడా.

తయారీ: ● ఒక పెద్దగిన్నెలో బటర్, క్రీమ్ చీజ్, పంచదార, గుడ్లు, వెనీలా, బాదం ఎసెన్స్ వేసి హ్యాండ్ మిక్సర్‌తో ఐదు నిమిషాలపాటు కలపాలి ● తరువాత మైదా, కార్న్ స్టార్చ్, వంటసోడా, ఉప్పు వేసి పిండి ముద్దలా కలపాలి ● ఈ పిండి ముద్దను రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి ● రెండు గంటల తరువాత తీసి చిన్నచిన్న ఉండలుగా చేసి బేకింగ్ ట్రేలో పెట్టాలి ● ఫోర్క్ సాయంతో ఉండపైన ఇంటూ ఆకారంలో ముద్ర పడేటట్లు వత్తాలి ● ఇలా అన్నిటినీ వత్తుకున్నాక ఎరుపు, పచ్చరంగు పంచదారను ఈ కుకీస్ పైన చల్లాలి ● ఇప్పుడు బేకింగ్ ట్రేని అవెన్‌లో పెట్టి 350 డిగ్రీల ఫారిన్ హీట్స్ వద్ద పదిహేను నిమిషాలు బేక్ చేస్తే సుగర్ కుకీస్ రెడీ.

మీ బద్ధకం అమ్మకు భారమే

చలికాలం



చలికాలం ముసుగు తన్ని పడుకుంటే
ఎంత బాగుణ్ణు.
బెడ్ దగ్గరకు పొగలు గక్కే టీ వస్తే
ఎంత బాగుణ్ణు.
టిఫిన్లూ, సూప్‌లు,
సాయంత్రం ఉడకబెట్టిన పల్లీలు...
ఎంత బాగుణ్ణు.
అన్నట్టు రగ్గులు, బొంతలు
భలే శుభ్రంగా, పొడిగా ఉండాలండోయ్.
చలికాలం ఎవరికీ పని చేయబుద్ధేయని కాలం.
కాని అమ్మకు తప్పుతుందా?
అమ్మ వెచ్చని రగ్గు కప్పుకుని టీవీ చూస్తూ
'టీ తెండి' అని అరిస్తే ఒకరోజైనా
ఇస్తారా ఎవరైనా?
చలికాలంలో ఇంటి సభ్యులు ఏం చేయాలి?

స్కూల్ టైమ్ మారదు. ఉదయం 8 లోపు బస్సొచ్చి ఆగుతుంది. పిల్లలకు బాక్స్ కట్టివ్వడమూ తప్పదు. ఏడున్నరకంతా కట్టాల్సిందే. టిఫిన్ తినిపించాల్సిందే. ఎంత చలి ఉన్నా, ఎంత మంచు కమ్ముకున్నా, ఎంత బద్ధకంగా ఉన్నా, ఎంత ముసుగుతన్ని నిద్రపోవాలని ఉన్నా అమ్మకు తప్పుతుందా? అమ్మ లేవకుండా ఉంటుందా? వంట గదిలో వెళ్లకుండా ఉంటుందా? నాన్న అర గంట లేటుగా లేవొచ్చు. వాకింగ్ ఎగ్గొట్టి అమ్మ ఇచ్చిన టీని చప్పరిస్తూ పేపర్‌ను చదువుతూ ఉండొచ్చు. కాని అమ్మ మాత్రం అదే వంట చేయాల్సిందే. రోజువారీ అంట్లు, బట్టల ఉతుకుడు చూడాల్సిందే. ఆమెకు ఇంట్లో నుంచి ఎలాంటి సాయం అందుతున్నదో ఆలోచించామా ఎప్పుడైనా?

బద్ధకమైన కాలం ఇది

చలికాలం బద్ధకం కాలం. తలుపులు కిటికీలు మూసుకుని అరచేతులు రుద్దుకుంటూ కూచోమని చెప్పే కాలం. బబ్బుంటే బాగుండు అనిపించే కాలం. అమ్మకు 'ఈ పూట ఎవరైనా వంట చేసి పెడితే బాగుండు' అనిపించినా అలా చేసేవారు ఎవరు? 'రోజూ వండుతున్నావ్ కదా ఇవాళ బజారు నుంచి వేడి ఇడ్లీ తెస్తానులే' అని బండి తాళం అందుకునే నాన్నలు ఎందరు? పాలల్లో కొన్ని చాకోస్ వేసివ్వు చాలు అనే పిల్లలు, బ్రెడ్ ఆమ్లేట్ చేసుకుని తింటాలే అనే భర్తలు ఉన్న ఇల్లు ఇల్లాలి శ్రమను గుర్తించే ఇల్లు. 'కాసేపు పడుకోలే' అని లేచి పేపర్లు లోపల పడేసి, పాలు ఫ్రిజ్‌లో పెట్టి, ఒక ప్యాకెట్ గిన్నెలో వేడి చేసి, కాఫీ కలిపి భార్యను లేపితే ఎంత బాగుంటుంది. మగవాళ్లు బట్టలు ఎలాగూ ఉతకరు. 'చెమ్మగా ఉన్నాయి' అని విసుక్కునే బదులు కనీసం ఎండ తగిలే తీగ దాకానో, డాబా మీదనో తీసుకెళ్లి ఆరేసే సాయం చేయరు. ఇలాంటి సమయంలో 'బట్టలు ఆరేయడం' అనే చిన్న పని కూడా చాలా పెద్ద సాయం కిందకు వస్తుంది.ఈ రోజుల్లో ప్రత్యామ్నాయ టిఫిన్లు, ఇన్‌స్టంట్ టిఫిన్లు ఎన్నో మార్కెట్‌లో ఉన్నాయి. యూట్యూబ్‌లో కొడితే వందలాది వీడియోలు ఉన్నాయి. తెచ్చిపెట్టే స్విగ్గి, జొమాటోలు ఉన్నాయి. ఈ శీతాకాలంలో ఉదయపు వంట చెర నుంచి అమ్మకు ఏ విధంగా ఉపశమనం ఇవ్వొచ్చో తప్పక ఆలోచించాలి.

అమ్మకు కావాలి వెచ్చని దుస్తులు

సాధారణంగా ఇళ్లల్లో నాన్నకు హాఫ్ స్వెటర్లు ఉంటాయి. ఎప్పుడూ వేసుకునే ఉంటాడు. అమ్మకు మాత్రం ఎందుకనో స్వెటర్ ఉండదు. కొని తేవాలని ఎవరికీ అనిపించదు. చాలా ఇళ్లల్లో అమ్మలు పాతబడిన స్వెటర్లతోనే తిరుగుతూ ఉంటారు ఈ సీజన్లలో. ఒక రంగురంగుల కొత్త స్వెటర్ కొనుక్కోవాలని వారికి ఉంటుంది. ఉద్యోగం చేస్తున్నా, గృహిణి అయినా తాను కొనుక్కునే చొరవకు ఎప్పుడూ అమ్మ దూరంగానే ఉంటుంది. స్వెటర్ లేకుండానే చలికాలం గడిపేస్తుంది. ఆమెకు స్వెటర్, సాక్సులు, స్కార్ఫ్‌లు కావాలి. ఉన్నాయా గమనించండి. ఆమె అడగదు. తెచ్చి పెట్టండి. శీతాకాలంలో స్త్రీలు తమ శరీరం గురించి ఆలోచన చేస్తారు. చర్మాన్ని, శిరోజాల్ని కాపాడుకోవడానికి వారికి కొన్ని వస్తువులు అవసరం. క్రీములు, నూనెలు, సబ్బులు... ఏర్పాటు చేయాలి. చర్మ సమస్యలు కొందరిలో రావచ్చు. వాటిని చిట్కాలతో సరిపుచ్చుతూ బాధ పడాల్సిన పని లేదు. వైద్యుల దగ్గరకు వెళ్లాలి. తీసుకువెళ్లాలి. ఇక ఇంట్లో గర్భిణీ స్త్రీలు ఉంటే చలికాలం మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. రోజువారీ చాకిరీ నుంచి దాదాపుగా తప్పించాలి.

ఇంట్లో పెద్దవారు ఉంటే?

అమ్మమ్మో, నానమ్మో ఇంట్లో ఉంటే వారి గురించి ఇల్లంతా మరింత శ్రద్ధ పెట్టాలి. మంచి షాల్, రగ్గు వారికి ఏర్పాటు చేయాలి. నేలకు పాదాలు తాకి జిల్లు మనకుండా ఇంట్లో తిరగడానికి మంచి స్లిప్పర్లు ఇవ్వాలి. స్లిప్పర్లలోనే తిరగమని చెప్పాలి. చలికి ఆకలి ఎక్కువ. పెద్దవారు పసిపిల్లల్లా మారి నోటికి హితంగా వేడివేడిగా అడుగుతారు. వారికి ఏదో ఒకటి చేసి పెట్టాలి. ఆ పనిలో కూడా అమ్మకు భర్త, పిల్లలు ఏదో ఒక మేరకు సాయం చేయాలి. వారికి వెచ్చని గది కేటాయించాలి. లేదా ఇంట్లోని వెచ్చని ప్రదేశమైనా.

శుభ్రత అందరిదీ

శీతాకాలం ఇల్లు మబ్బుగా ఉంటుంది. ఇటు పుల్ల అటు పెట్టబుద్ధి కాదు. కాని ప్రయత్నం చేసి ఇల్లు ప్రతి రోజూ సర్దుకునే పడుకోవాలి. హాల్లో బెడ్‌రూముల్లో కిచెన్‌లో కుటుంబ సభ్యులంతా నిద్రకు ముందు వీలైనంత శుభ్రంగా, సర్ది పడుకుంటే ఉదయాన్నే అమ్మ లేచినప్పుడు చిందరవందర లేకుండా పనిలో పడబుద్ధి అవుతుంది. పక్క బట్టలు మడవడం కూడా కొంతమంది చేయరు. అలాంటి వారిని తప్పక గాడిలో పెట్టాలి. చలికాలం అమ్మకి పని తేలిక చేద్దాం. చలికాలాన్ని ఎంజాయ్ చేసేలా చూద్దాం.

● ముగ్గు-ముచ్చట

ముగ్గులకు ఆహ్వానం

ధనుర్మాసం వచ్చిందంటే ఇంటిముంగిట తీర్చిదిద్దిన అందమైన రంగవల్లులు... ముచ్చటైన గొబ్బెమ్మలు... తెలుగింటి ఆడపడచులందరూ తమకు వచ్చిన ముగ్గులను మరొకరితో



పంచుకుంటూ... తెలియని వాటిని నేర్చుకుంటూ కనిపిస్తుంటారు. మరి మీరు కూడా ముగ్గులు బాగా వేస్తారా? అలా అయితే ముచ్చటైన మీ ముగ్గులను అందమైన రంగులతో కాగితం మీద పెట్టండి. చుక్కల వివరాలతో సహా వాటిని మాకు పంపండి. అందిన వాటిలో చక్కటి ముగ్గును మీ ఫొటోతో సహా మేము ప్రచురిస్తాం.

ముగ్గులు పంపవలసిన చిరునామా
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com